94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21




# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU




అమరావతి సంపుటి : 4 సంచిక : 48, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 2 - ఆదివారం 8 సెప్టెంబర్, 2019

Amaravati Volume : 4 Issue : 48, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY Monday 2 - Sunday 8 September, 2019

వివరాలు 2లో...



2న ఇడుపులపాయకు ముఖ్యమంత్రి జగన్

వివరాలు 3లో...



జై జై గణేషా..

వివరాలు 3లో...



నేటి నుంచే కొత్త వాహన చట్టం

వివరాలు 4లో...



ఈ నరకం భరించలేం..

## భూములను తిరిగి ఇచ్చేయమంటున్న రాజధాని రైతులు

**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కొరకు రైతుల భూములను భూసమీకరణ ద్వారా గత ప్రభుత్వం తీసుకొంది. దాదాపు 33 వేల ఎకరాల సారవంతమైన భూమిని రైతులు కొంతమంది తమకు ఇష్టంగా, మరి కొంతమంది వారి ఇష్టంలేకపోయినా ప్రభుత్వానికి ఇచ్చారు. మరికొంతమంది రైతులు భూములను వ్యాపారవేత్తలకు, కంపెనీలకు అమ్మగా వారు భూసమీకరణ ద్వారా ప్రభుత్వానికి ఇచ్చారు. అధికశాతం భూములు కంపెనీలు, నాయకులు బీనామి పేర్లతో కొన్నారని రాజధాని రైతులు అనుకుంటున్నారు. అయితే రాజధాని ప్రాంతంలో మూడు పంటలు పండే భూములను రాజధాని నిర్మాణానికి తీసుకోవటం మంచిదికాదని అనేక మంది మేధావుల వాదన. దీంతో ఆహార కొరత ఏర్పడటం జరిగిందని రైతులు తెలుపుతున్నారు. అంతేకాకుండా ఈ భూములపై ఆధారపడి దాదాపు లక్షన్నర రైతుకూలీలు బతుకుతున్నారని ప్రభుత్వమే ఆనాడు తెలిపింది. పర్యావరణానికి కూడా హాని కలుగుతుందని సామాజిక వేత్తలు హెచ్చరించారు. భూములు తీసుకొని రైతులకు నివాస,వాణిజ్య ప్లాట్లు కేటాయించారు. భూములు తీసుకునేముందు రైతులకు కేటాయించిన ప్లాట్లను మూడు సంవత్సరాలలో అభివృద్ధి పరిచి ఇస్తామని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట ఇచ్చారు. ప్లాట్ల అభివృద్ధి అంటే రోడ్లు, డ్రైనేజీ, కరెంటు, మంచినీరు మొదలైన వసతులను కల్పిస్తామని చంద్రబాబు నమ్మబలికారు. ఐదు సంవత్సరాలయినప్పటికినీ ప్లాట్ల అభివృద్ధి జరగలేదు. భూములు తీసుకునేముందు రైతులకే ప్రాధాన్యత ఇస్తామన్న మాజీ ముఖ్యమంత్రి వ్యాపారస్తులకే పెద్దపీట వేసినట్లు కనిపిస్తుంది. వివిధ సంస్థలకు ఆఘమేఘాలమీద భూములను కేటాయించడం జరిగింది. ఉదాహరణకు ఎస్ఆర్‌యం, విట్ యూనివర్సిటీలు ఈ కొవకు చెందినవే. అయితే ఒక ప్రణాళికా బద్ధంగా, పారదర్శకంగా పనులు చేయకపోవడంతో రైతులకిచ్చిన ప్లాట్లను అభివృద్ధి పరచలేకపోయారని స్థానిక రైతులు వాపోతున్నారు. అయితే ఇటీవల నూతన ప్రభుత్వం రావడంతో రాజధాని అమరావతి

- మిగతా 2 లో

## ఆంధ్రా బ్యాంకు కనుమరుగు




**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయడంలో భాగంగా విలీన ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. కొన్ని నెలల క్రితమే బ్యాంక్ ఆఫ్ బరోడా, విజయా బ్యాంకు, దేనా బ్యాంకులను

- మిగతా 2 లో

# పర్యావరణాన్ని రక్షించండి : సీఎం

- పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 25కోట్ల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌ను ప్రక్షాళన చేస్తాం
- దశల వారిగా 10 వేల ఎలక్ట్రిక్ బస్సులు తీసుకోస్తాం
- వన మహోత్సవ కార్యక్రమంలో సీఎం జగన్





**రాజధాని వార్తలు, గుంటూరు :** పర్యావరణ రక్షణ కోసం ప్రభుత్వంతో పాటు అదరూ కలిసి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. నీరు, నేల, నింగి, గాలి వీటన్నిటిని కూడా కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిది అని పిలుపునిచ్చారు. విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని కోరారు. అడవుల సంఖ్య ఏటేటా తగ్గిపోతుందని, వీటిని పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం జగన్ శనివారం గుంటూరు జిల్లా డోకిపర్రు గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ పాలుపంచుకొని ప్రభుత్వానికి తోడుగా నిలవాలని కోరారు. సీఎం జగన్ ఇంకా ఎమన్నారంటే..

**అందుకే అశోకుడు గొప్ప చక్రవర్తి అయ్యాడు**

'మనం నాటే ప్రతి మొక్కభూమాతకు మేలు చేస్తుంది. మనం పెంచే ప్రతి చెట్టు తరువాతి తరానికి కూడా వీటి ఫలాలను ఇస్తుంది. మాములుగా మనిషి బతకాలంటే ఆక్సిజన్ కావాలి. అటువంటి ఆక్సిజన్ ఇచ్చే ఏకైక ప్రాణి ఒక్క చెట్టు మాత్రమే. ఈ సృష్టిలో బ్యాలెన్స్‌గా ఉండాలంటే చెట్లు బలంగా ఎదగాలి. రాష్ట్ర భూభాగంలో 37,258 చదరపు కిలోమీటర్లు ఉంటే ఇందులో 23 శాతం మాత్రమే అడువులు ఉన్నాయి. ఇందులో 13 శాంక్షరీలు, మూడు నేషనల్

- మిగతా 2 లో

# మత ప్రమేయం లేని లౌకిక రాజ్యం ఇదేనా??

- స్వల్ప విషయాలపై రభస అవసరమా ?
- మైనార్టీల మనోభావాలను పట్టించుకోరా ?
- అన్యమత ప్రచారం పేరిట గగ్గోలు ఎందుకు?

**రాజధాని వార్తలు, డెస్క్ :** ఇటీవల కాలంలో అన్యమత ప్రచారం చేస్తున్నారంటూ కొందరు హిందూ సోదరులు, హిందూ మత సంస్థలు, కొందరు స్వామీజీలు మీడియాలో ధ్వజమెత్తుతూ పాలక వర్గాలను దుమ్మెత్తిపోయడం ఆనవాయితీగా మారింది. గతంలో జరిగిన సంఘటనలను వదిలేస్తే తాజాగా తిరుమల బస్సు టిక్కెట్లపై వివాదం చెలరేగింది. గత ప్రభుత్వం హయాంలో సదరు బస్సు టిక్కెట్ల వెనుక మైనార్టీ పుణ్యక్షేత్రాలకు సంబంధించిన సమాచారం ఉందంటూ రగడ చేస్తున్నారు. అది మా ప్రభుత్వ దోషం కాదంటూ ప్రస్తుత పాలక పక్షం విమర్శలను తిప్పి కొడుతోంది. ఈ ప్రహసనాన్ని ప్రక్కన పెట్టి కొన్ని విషయాలను ఈ సందర్భంగా




జ్ఞాపకం చేసుకుందాం.

ఈ దేశంలో కానీ,ఈ రాష్ట్రంలో గానీ ప్రభుత్వ సంబంధమైన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతున్నప్పుడు యధేచ్ఛగా మెజారిటీ మతమైన హిందూ వర్గానికి సంబందించిన పూజలు, పునస్కారాలు జరపటం, జరగడం దశాబ్దాలుగా ఈ సమాజంలో కొనసాగుతోంది. కొన్ని భారీ ప్రారంభోత్సవాల సమయంలో తూతూ మంత్రంగా మైనార్టీ మత ప్రతినిధులను పిలిపించి రెండు నిముషాల పాటు ఓ తతంగాన్ని పూర్తి చేస్తారు. కానీ గల్లీ నుంచి ఢిల్లీ దాకా జరిగే ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కార్యకలాపాలలో హిందూ ధర్మం కన్పిస్తుంది. చాలా ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతి శుక్రవారంగాని, శనివారంగాని ఓ పూజారి వచ్చి పూజలు నిర్వహించి సిబ్బందికి ప్రసాదాలు పంపిణీ చేసి వెళ్లి పొవటం పచ్చినిజం.

ఇక రాష్ట్రపతి మొదలుకొని, గవర్నర్, ముఖ్యమంత్రులు, మంత్రులు, హిందూ పుణ్యక్షేత్రాలకు వచ్చి అధికారిక లాంఛనాలతో దర్జాగా పూజలు చేసి వెళ్లిపోతుంటారు. వాస్తవానికి సెక్యులర్ రాజ్యంలో ఇవన్నీ సదరు వ్యక్తుల ప్రైవేటు కార్యక్రమాలుగా జరుపుకోవాలి. దురదృష్టం ఏమంటే సదరు ప్రముఖులు పూజలు నిర్వహించుకునే సమయంలో కలెక్టర్లు, యస్పీలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, స్థానిక పోలీసులు, అధికారులు తమ దైనందిన విధినిర్వహణను ప్రక్కన పెట్టి భక్తిగా చేతులుకట్టుకుని ప్రముఖుల ప్రక్కన కాలం వెళ్లబుచ్చుతారు.

ఇక ఏదైనా ప్రధానమైన ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడుగాని, దేశ విదేశీ.. ప్రముఖులు సదరు ఫంక్షన్లకు హాజరైనప్పుడుగాని ప్రభుత్వం తరుపున వారికి అందజేసే జ్ఞాపికలు సైతం హిందూ ధర్మానికి సంబందించినవే కావటం గమనార్హం. అవి స్వీకరించేవారుగాని, ఇచ్చేవారుగాని ఏ ఫీలింగ్ లేకుండానే ఆ జ్ఞాపికల కార్యక్రమం కొనసాగుతుంది.

ఇక ముఖ్యమంత్రులు, వివిధ శాఖలకు చెందిన మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఇటీవల కాలంలో యజ్ఞాలు చేయటం పరిపాటి అయింది. కోట్లాది రూపాయల ఖర్చయ్యే ఆ యజ్ఞ, యాగాలకు నిధులు స్వంతవో లేక ప్రభుత్వానివో ఎవరికీ తెలియదు. దానికి సంబంధించిన జమా ఖర్చులు ఎక్కడా కనపడవు. ఇక పుష్కరాల వంటి పుణ్య కార్యక్రమాలు జరిగే సమయంలో ప్రభుత్వం చేసే హంగామా అంతా ఇంతా కాదు. ఈ మధ్యకాలంలో నదులకు పూజలు చేయటం, కాల్వలకు నీరు వదిలేటప్పుడు పూజలుచేయటం, జలదేవతకు చీర, సారె సమర్పించటం ఇవన్నీ కూడా హిందూమత ధర్మానికి సంబంధించినవే.

ఇక దూరదర్శన్ కేంద్రాల విషయానికొస్తే ఆంధ్రప్రదేశ్ దూరదర్శన కేంద్రానికి "సప్తగిరి" అని, తెలంగాణా దూరదర్శన్ కేంద్రానికి "యాదగిరి" అని ఏ సంకోచం లేకుండా పేర్లు పెట్టేశారు. ఈ పేర్లు ఏ ధర్మానికి సంబంధించినవో అందరికీ తెలుసు. ఇక ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న ప్రైవేటు ఛానల్స్ ఏ రోజూ కూడా మైనార్టీ మతాలకు సంబంధించిన భక్తి గీతాలను గాని, కార్యక్రమాలను గాని ప్రసారం చేయరు. ప్రాత: కాల సమయంలో భక్తి రంజని కార్యక్రమంగాని, కేవలం హిందూధర్మానికి సంబంధిచినవే ప్రసారం చేయటం గమనార్హం. అంటే ఈ ఛానల్స్‌ను అంశాల గురించి ఆలోచించాలి. మత ప్రమేయంలేని లౌకిక రాజ్యంలో జరుగుతున్న మత కార్యకలాపాలన్నిటినీ (మైనార్టీ మతాలతో సహా) నిషేధించి సెక్యులర్ విధానాన్ని అవలంభిస్తే అందరికీ మంచిదే. దరదృష్టమేమంటే మత ప్రమేయం లేని లౌకిక రాజ్యం అంటే అన్ని మత కార్యక్రమాలను నిర్వహించటం అని భావిస్తున్నాం. **అసలు ఏ మత ప్రమేయం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించడమే మనం రాజ్యాంగాన్ని గౌరవించడం కాగలదు.** చివరిగా ఒక్క మాట అతి త్వరలో వినాయక ఉత్సవాలు



కేవలం హిందూవులే చూస్తారని వారి అభిప్రాయమా? లేక సెక్యులజం మీద ఉన్న తేలిక భావానా? మతం వ్యక్తిగతమైనది. అందరికీ తెలుసు. కానీ అయ్యప్పమాలలు ధరించి చట్ట సభలకు హాజరుకావటం, ఎన్నికల సభలలో పాల్గొనటం పరమ సహజంగా జరిగి పోతోంది. ఇది పెద్దగా ఆక్షేపించ దగిన విషయం కాదు. కేవలం బైబిల్, ఖురాన్ పట్టుకొని ప్రసంగాలు చేయటం మతప్రచారమైతే అయ్యప్ప స్వామి మాలలు ధరించి, లేదా తిరుపతిలో దైవదర్శనం చేసుకొని బయటకు వచ్చాక ఆ పూజా వస్త్రాలతోనే మీడియాతో వివిధ అంశాలు మాట్లాడటం మత ప్రచారం కాదా? స్వల్ప విషయాలపై అన్యమత ప్రచారమంటూ ధ్వజమెత్తె పెద్దలకు ఈ మాత్రం అవగాహన లేదంటారా? ఇప్పటి వరకు మనం ప్రస్తావించిన అంశాలన్నిటిపై ఏ రోజైనా మైనార్టీ మతస్థులు నోరేత్తి మాట్లాడటాన్ని మనం చూశామా? అంటే ఈ దేశంలో మైనార్టీ మతస్థులకున్నంత విశాల దృక్పధం మెజారిటీ మతస్థులకు లేదనే అనుకోవాలా? మేధావులు, ప్రజాప్రతినిధులు ఈ ఆరంభం కానున్నాయి. ప్రతి నగరంలో, ప్రతి పట్టణంలో, ప్రతి గ్రామంలో నడిరోడ్డుపై వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి భారీ ఎత్తున పూజలు చేయటం ఆనవాయితీ. ఈ ఉత్సవాలు ట్రాఫిక్‌కు ఎంతో అవరోధం కల్పిస్తున్నప్పటికీ, ఆ అసౌకర్యాన్నీ, శబ్దకాలుష్యాన్నీ ఏ అధికారి ప్రశ్నించడు. ఏ ప్రజాప్రతినిధి నోరు ఎత్తడు. ఇక్కడ గమనించాల్సిన విషయమే మంటే ఇదే పని మైనార్టీ మతస్థులు వారి వారి విశ్వాసాలకు అనుగుణంగా చేస్తే సదరు హిందూ మత పెద్దలందరూ భరించగలరా? ఆలోచించండి! వ్యవస్థలను కాపాడుకునేందుకు అభ్యుదయ భావాలు కల్గిన వారంతా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది. ఇకనైనా చిన్న చిన్న విషయాలను భూతద్దంలో చూస్తూ చౌకబారు, కామెంట్లు చేయడం అపేయాలి. మెజారిటీ మతస్తులు చేసే ఈ రగడకు ప్రభుత్వం ఆపసోపాలు పడుతూ సమాధానం చేప్పడం కూడా సరికాదు. అలాగైతే పైన పేర్కొన్న అంశాలన్నింటికి ప్రభుత్వం సమాధానం చెప్పాలి!

## వినాయకచవితి శుభాకాంక్షలు



## రాజధాని వార్తలు కలం

# బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో ఎలా బలపడుతుంది?

### ఆంధ్రా కోడలి దెబ్బ.. ఆంధ్రా బ్యాంకు అడ్రెస్ గల్లంతు!

రాజకీయ పార్టీలు ప్రజలకు సేవ చేయాలని తమ రాష్ట్రం, దేశాని అభివృద్ధి పథంలో నడపాలని కోరుకుంటారు. ఆ దిశగా అధికారం చేపట్టాలని ప్రణాళికలను రచించి ఉత్తమ మ్యానిఫెస్టోలను తయారు చేస్తారు. మ్యానిఫెస్టో అంటే తాము అమలు చేయబోయే పథకాలని ప్రజలను నమ్మించి ఎన్నికలలో గెలుపొందాలని ప్రయత్నిస్తారు. అమెరికా లాంటి దేశాలలో మ్యానిఫెస్టోలను తూచా తప్పకుండా పాటిస్తారు. మన దేశంలో గాని, మన రాష్ట్రంలో గాని ఎన్నికలలో గెలిసిన తరువాత మ్యానిఫెస్టోలను మరిచిపోతారు. ఇంకా ఎన్నికల ముందు అనేక ఎత్తుగడలను వేస్తు ఉండటం, మెజారిటీ వర్గాల ఆధరణ పొందాలని ఎంతో తాపత్రయపడటం రాజకీయ పార్టీలకు పరిపాటి. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్‌లోని బీజేపీ అనేక ప్రణాళికలను రూపొందించి అమలు చేయటానికి ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఆంధ్రా బ్యాంకు ను విలినం చేయటం బీజేపీకి అనుకూలమా లేక ప్రతికూలమో కాలమే నిర్ణయించగలదు.

ఆంధ్రా బ్యాంకు... ఈ పేరు వినగానే తెలుగు ప్రజలు తమ సొంత బ్యాంకుగా పరిగణిస్తారు. ఆంధ్రా బ్యాంకు శాఖకు వెళితే.. తమ బ్యాంకులోకి అడుగుపెట్టినట్టే ప్రతి తెలుగోడూ భావిస్తాడు. అలాంటి ఆంధ్రా బ్యాంకు ఇకపై కనబడదు. తెలుగోడి గుండె పగిలే ఈ వార్త ఎవరి నోటి నుంచి వచ్చిందో తెలుసా? ఆంధ్రా కోడలైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నోటి నుంచే ఈ వార్త వినాల్సి రావడం నిజంగా దురదృష్టకరమే. ఏం చేస్తాం మరి... తెలుగింటి కోడలు దేశ రాజధానిలో మీడియా సమావేశం పెట్టి మరీ తన అత్తారింటి బ్యాంకుగా పేరుగాంచిన ఆంధ్రా బ్యాంకును ఇంకో బ్యాంకులో విలీనం చేస్తున్నామని - ఇకపై ఆంధ్రా బ్యాంకు పేరు వినిపించదని ఏమాత్రం సంకోచం లేకుండానే చెప్పేశారు.

తెలుగింటి కోడలు అయినా - ఆంధ్రా కోడలుగా మనం పిలుచుకున్నా... తన సొంత రాష్ట్రం - తన పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రాలపై శీతకన్నేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్ లో కీలక మంత్రిగా ఉన్నా... తన అత్తారింటికి జరుగుతున్న అన్యాయాన్ని ఆపడం సాధ్యం కాదు కదా. ఏపీలోని కీలక జిల్లా - రాజకీయంగా మంచి పరిణతి కనిపించే జిల్లాగా పేరున్న కృష్ణా జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య... ఎప్పుడో స్వాతంత్ర్యానికి పూర్వమే 1923 నవంబర్ 20న కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఆంధ్రా బ్యాంకును ప్రారంభించారు.

అప్పటి నుంచి ఇప్పటిదాకా తనదైన రీతిలో సేవలు అందించిన ఆంధ్రా బ్యాంకు.. తన ప్రధాన కార్యాలయాన్ని మచిలీపట్నం నుంచి ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు మార్చుకుని దేశీయ బ్యాంకింగ్ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆంధ్రా బ్యాంకుకు 2885 బ్రాంచ్‌లు ఉన్నాయి. 38 శాటిలైట్ కార్యాలయాలు - 3798 ఏటీఎంలను కలిగిన ఆంధ్రా బ్యాంకు ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో కీలక బ్యాంకుగానే ఎదిగింది.

1969లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ... బ్యాంకుల జాతీయకరణ దిశగా తీసుకున్న నిర్ణయంతో అప్పటిదాకా తన సొంతంగానే సాగిన ఆంధ్రా బ్యాంకు కూడా ప్రభుత్వ రంగ బ్యాంకుగా మారిపోయింది. ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేట్ బ్యాంకుల పోటీని కూడా తట్టుకుని ఆంధ్రా బ్యాంకు తనదైన శైలి ప్రగతిని సాధించింది. ఇలాంటి బ్యాంకు ఇకపై కనిపించదంటే... నిజంగానే తెలుగు ప్రజలకు చేదు వార్తగానే చెప్పాలి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆంధ్రా బ్యాంకును కలిపేస్తున్నట్లుగా నిర్మల చేసిన ప్రకటన తెలుగోళ్లకు కోపం తెప్పించిందనే చెప్పాలి.

ఈ కోణంలో కొందరు నిర్మల నిర్ణయాలను పరిశీలన చేయగా... ఓ ఆసక్తికర అంశం వెలుగు చూసింది. మహారాష్ట్ర కేంద్రంగా కొనసాగుతున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వాస్తవానికి ఆంధ్రా బ్యాంకు కంటే చిన్నదే. అయితే ఆ బ్యాంకును ఏ ఒక్క బ్యాంకులో విలీనం చేయని నిర్మల... దాని కంటే ఎన్నో రెట్లు పెద్దదైన ఆంధ్రా బ్యాంకును మాత్రం యూనియన్ బ్యాంక్ లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడం నిజంగానే ఆగ్రహం తెప్పించేదే. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు విలీనం బెడద లేకుండా చూసిన కేంద్రం... దాని బలోపేతానికి ఇతోధికంగా నిధులు ఇచ్చే దిశగానూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం కూడా నిర్మల నోట వెంటే వినాల్సి వచ్చింది.

ఇక ఆంధ్రా బ్యాంకులో ఇతర బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రా బ్యాంకు పేరును కొనసాగిస్తారని కొందరు ఆశించినా... అందుకు విరుద్ధంగా వ్యవహరించిన కేంద్రం... ఆంధ్రా బ్యాంకును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేస్తూ... యాంకర్ బ్యాంకుగా యూనియన్ బ్యాంకే వ్యవహరిస్తుందని ప్రకటించి... ఆంధ్రా బ్యాంకు పేరు ఇకపై వినబడదని సంచలన ప్రకటన చేసింది. మొత్తంగా ఏళ్ల తరబడి ఉత్తమ సేవలు అందించిన తెలుగోళ్ల బ్యాంకు పీక తెలుగింటి కోడలు చేతితోనే పిసికించేయడం మోదీ మార్కు పాలనకే చెల్లిందన్న వాదన వినిపిస్తోంది.

నిస్వార్ధపరుడు, నిజాయితీ పరుడైన రాజకీయదురంధరుడు స్థాపించిన బ్యాంక్, తెలుగుగడ్డమీద ఉన్న తెలుగుపేరుతో ఉన్న ఒకేఒక్క బ్యాంక్ ఆంధ్రాబాంక్. విలీనంచేసినా పేరుమార్చకుండా ఉంటే తెలుగువారికి సంతృప్తిగా ఉండేది. పేరుమార్చి తెలుగువారికి అన్యాయంచేశారు. అవమానించారు. దీంతో తెలుగు ప్రజల ఆగ్రహానికి బీజేపీ పార్టీ గురికావడం ఖాయంమనే చెప్పాలి. కనీసం ఆంధ్రా బ్యాంకు పేరైనా తొలగించకుండా ఉంటే బ్యాంకుని స్థాపించిన భోగరాజు పట్టాభి సీతారామయ్యకు గుర్తుగా ఉండేది. తెలుగు జాతి గర్వించదగేది.

# నేడు విజయవాడ - గూడూరు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం




**రాజధాని వార్తలు, విజయవాడ :** సెప్టెంబరు 2 నుంచి రోజూ ఉదయం 6 గంటలకు గూడూరులో ఈ రైలు బయల్దేరి ఉదయం 10.30 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. విజయవాడ-గూడూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు 1వ తేదీన ప్రారంభించటానికి రైల్వే అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు చేతులమీదుగా ఈ ప్రారంభోత్సవం జరగనుంది. కేంద్ర రైల్వే సహాయ మంత్రి సురేష్ అంగడి కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. దక్షి ణ మధ్య రైల్వే పరిధిలో విజయవాడ డివిజన్ నుంచి నడిచే ఈ రైలు సొంతజిల్లా కావటంతో గూడూరు నుంచి వెంకయ్యానాయుడు ప్రారంభిస్తారు.



**సెప్టెంబర్ 5 ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు**

# పేదల జోలికి రావోద్దు!: చంద్రబాబు



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో ఇసుక కొరత నెలకొందంటూ టీడీపీ తీవ్రస్థాయిలో నిరసన గళం విప్పిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ అంశంపై పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్పందించారు. దేన్నయినా సహిస్తాం కానీ, పేదల జోలికి వస్తే మాత్రం ఖబడ్దార్ అంటూ ఏపీ సర్కారును హెచ్చరించారు. పేదలకు అన్యాయం జరుగుతుంటే టీడీపీ చూస్తూ ఊరుకోదని ట్వీట్ చేశారు. ఇసుక కొరత కారణంగా లక్షల మంది పేదవాళ్ల ఉపాధి మార్గాలను కూల్చివేశారని, ఆఖరికి వాళ్ల ఇళ్లను కూడా కూల్చివేసి నిలువ నీడలేకుండా చేస్తారా? అంటూ మండిపడ్డారు.

# నారా లోకేష్ చిప్ పాడైంది.. కాస్త రిపేర్ చేయండి



**రాజధాని వార్తలు, అమరావతి :** ఇసుక దోపిడీని అడ్డుకుంటే 24 గంటలు కరెంటు సరఫరా నిలిచి పోయినంతగా గంగ వెర్రులెత్తుతున్నారని మండిపడ్డారు.

మరోసారి సెటైర్లతో ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు... ఆయన తనయుడు నారా లోకేష్‌పై కూడా విమర్శల వర్షం కురిపించారు. ట్విట్టర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. చిత్తు చిత్తుగా ఓడిపోయి 3 నెలలు కాలేదు. మిమ్మల్ని ఓడించిన ప్రజలు రాక్షసులా? అంటూ నారా లోకేష్‌ను ప్రశ్నిస్తూ సాయిరెడ్డి ట్వీట్లు చేశారు. ఏకపక్ష తీర్పుతో వారు విజయ తిలకం దిద్దిన వ్యక్తి భస్మారుడా? స్పృహలో ఉండే మాట్లాడుతున్నాడా? అంటూ మండిపడ్డారు. ఈ వయసులోనే మెదడులో చిప్ పాడైనట్లుంది. కాస్త రిపేర్ చేయించండి. కాబోయే పార్టీ అధ్యక్షుడు కదా? అంటూ నారా లోకేష్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఇసుక దోపిడీని అడ్డుకుంటే 24 గంటలు కరెంటు సరఫరా నిలిచి పోయినంతగా గంగ వెర్రులెత్తుతున్నారని మండిపడ్డారు. ఇసుకుపై కొత్త పాలసీ వచ్చిన తర్వాత ఇంకెంత రెచ్చి పోతారో? ఈ ధర్నాల ఉద్దేశం చూస్తుంటే, ఎప్పటిలాగే మా వాళ్లను ఇసుక బొక్కనివ్వండి సీఎం గారూ అని వేడుకుంటున్నట్టుగా ఉందని సాయిరెడ్డి ఎద్దేవా చేశారు.

రాజధాని ప్రాంతాన్ని వరద ముంచెత్తినప్పటి నుంచి చంద్రబాబు నాయుడు దెయ్యం పట్టిన వాడిలా మారిపోయారని విమర్శించారు విజయసాయిరెడ్డి. భూములపై వందల కోట్లు పెట్టుబడి పెట్టిన తన బినామీలు, బంధువర్గం పరిస్థితి ఏమవుతుందనే బెంగ పట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత అయి ఉండీ రియల్ ఎస్టేట్ వ్యాపారిలా బాధపడుతున్నారని విమర్శించారు. రాజకీయాల్లో హింసా ప్రవృత్తికి ఆద్యుడు చంద్రబాబే అన్నారు. ఆయన ఐదేళ్ల రాక్షస పాలనలో వందల మంది వైసీపీ నేతలు జైళ్ల పాలయ్యారన్నారు. వేల మందిని గ్రామాల నుంచి తరిమేశారని ఆరోపించారు. 600 మందిని హత్య చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు విజయసాయిరెడ్డి. వృద్ధ జంబూకం శాంతి వచనాలు పలికినట్టు ఇప్పుడు వేధింపుల గురించి మాట్లాడుతున్నారన్నారు.

# భూములను తిరిగి ఇచ్చేయమంటున్న రాజధాని రైతులు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణ ప్రదేశం గురించి చర్చ అటు ప్రభుత్వంలోనూ, ప్రతిపక్షంలోనూ వాడి వేడిగా జరుగుతోంది. వాదోపవాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. రాజధాని ప్రదేశం మార్చవద్దని ప్రస్తుత ప్రదేశంలోనే రాజధాని నిర్మాణం జరగాలని ప్రతిపక్షం పట్టుపడుతుంది. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గాని, మంత్రులుగాని రాజధాని ప్రాంతాన్ని మారుస్తున్నామని చెప్పలేదు. అయితే ఈ ప్రాంతం వరద ముంపు ప్రాంతమని, సారవంతమైన భూములు భారీ నిర్మాణలకు అనుకూలంగా ఉండవని, పర్యావరణానికి హాని జరుగుతుందని సామాజికవేత్తలు వాపోతున్నారు. అంతేకాకుండా నిర్మాణ వ్యయం కూడా దాదాపు రెట్టింపువుతందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపిన విషయం తెలిసిందే. అంతే కాకుండా రాజధాని భూముల విషయంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని, మరేన్నో అవకతవకలు జరిగాయని పలు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రైతుల భూములతో గత ప్రభుత్వం వ్యాపారం చేయాలనుకోవటం, రైతులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఒంటెద్దుపోకడలతో పలు నిర్ణయాలు తీసుకోవడం గత ప్రభుత్వ తప్పిదమని రైతులు నమ్ముతున్నారు.

గత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తమకు ప్లాట్లు అందుబాటులో లేకపోవడం జరిగింది. అంతేకాకుండా వ్యవసాయం కూడా చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రాజధాని ప్రాంత రైతులు తమకు అన్యాయం జరిగిందంటున్నారు. కాబట్టి త్వరలో తామిచ్చిన భూములను తిరిగి ఇచ్చేయాలని రాజధాని ప్రాంత రైతులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కొరుకుంటున్నారు.



**రాజధాని వార్తలు, మంగళగిరి :** ఎన్ఆర్ఐ అకాడమీ హాస్పిటల్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ అధ్యక్షులైన డాక్టర్ ఉపేంద్రనాథ్ నిమ్మగడ్డ కుఅత్యుత్తమ సిటిజెస్ లయజెస్ వాలంటీర్‌గా గుర్తించి అమెరికా రాయభార కార్యాలయ వైస్ కౌన్సిల్ జెక్ దినర్‌మన్ ప్రశంస పత్రాని అందజేశారు. అకాడమీ అధ్యక్షులు అందుబాటులో లేకపోవడంతో ప్రశంసా పత్రమును ఎన్ఆర్ఐ అకాడమీ ట్రెజరర్ డాక్టర్ మణి అక్కినేని కి అందజేశారు.




**ఇటీవల మలేషియా దేశం ఆమ్నెస్టీ ప్రకటించడంతో తెలుగు సంఘాల ఐక్య వేదిక అధ్వర్యంలో అవగాహనా సదస్సుకు హాజరైన ఏపీ ఎన్ఆర్‌టి ఛైర్మన్ వెంకట్ మేడపాటి.**

**ప్రధాని మోడీ పిలుపుతో ఫిట్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రొ.వైస్ ఛాన్సలర్, ఉద్యోగులు**




### నూతన ఇసుక పాలసీ అమలుకు ప్రభుత్వం సిద్ధం

**రాజధాని వార్తలు, అమరావతి :** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నూతన ఇసుక పాలసీను అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త ఇసుక పాలసీ అమలుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో మొత్తం 102 ఇసుక రీచులను ప్రభుత్వం సిద్ధం చేసింది. 57 ఇసుక స్టాక్ పాయింట్లను అధికారులు సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇసుక నిల్వలు స్టాక్ పాయింట్లకు చేరుతున్నాయి.



**తిరుమల తిరుపతి దేవాలయ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించిన ఎస్ఆర్ఎం యూనివర్శిసిటీ ప్రొ.వైఛాన్సలర్ ప్రొఫెసర్ డా॥ డి. నారాయణరావు**

# ఆంధ్రా బ్యాంకు కనుమరుగు

(మొదటిపేజీ తరువాయి)

విలీనం చేశారు. ఇప్పుడు మరో 10 బ్యాంకులను కలిపి నాలుగు పెద్ద బ్యాంకులుగా ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఆ పది బ్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్‌లో పునాదులు వేసుకుని, తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక శాఖలు ఉన్న ఆంధ్రా బ్యాంకు కూడా ఉంది. ఆంధ్రా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ విలీనం తర్వాత ఆంధ్రాబ్యాంకు పేరు కనుమరుగు కానుంది.

తెలుగు నేలపై పురుడుపోసుకున్న ఏకైక జాతీయ బ్యాంకు ఆంధ్రాబ్యాంకు. ప్రముఖ

స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరైన డాక్టర్. భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్రాబ్యాంకును కృష్ణా జిల్లా మచిలీపట్నం (బందరు) ప్రధాన కేంద్రంగా స్థాపించారు. 1923 నవంబర్ 20న ఈ బ్యాంకు పేరు రిజిస్టర్ అయింది. లక్ష రూపాయల మూలధనం, రూ. 10 లక్షల అధీకృత మూలధనం (ఆథరైజ్డ్ క్యాపిటల్)తో 1923 నవంబర్ 28న కార్యకలాపాలు ప్రారంభించింది. ఇంరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో 1980లో ఈ బ్యాంకును జాతీయం చేశారు. జాతీయ చేసినప్పుడు ఆంధ్రాబ్యాంకు 974 పూర్తిస్థాయి శాఖలు, 40 క్లస్టర్ బ్యాంచ్‌లు, 76 ఎక్స్‌టెన్షన్ కౌంటర్లు ఉండేవి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2,904 శాఖలు ఉన్నాయి. 21,740 మంది సిబ్బంది పనిచేస్తున్నారు (30.09.2018 నాటికి). హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆంధ్రాబ్యాంకు లోగోలో పెద్ద ఇన్‌సానిటీ ( అనంతం ) చిహ్నం ఉంటుంది. అది వినియోగదారుల కోసం ఏ పని చేయడానికైనా, ఎంత దూరం వెళ్ళటానికైనా సిద్ధం అనే అనే సందేశాన్ని సూచిస్తుంది. గొలుసు మాదిరిగా కనిపించే తమ లోగో ఐక్యతను సూచిస్తుందని, ఎరుపు, నీలం రంగులు చైతన్యాన్ని, దృఢత్వాన్ని సూచిస్తాయని ఆంధ్రాబ్యాంకు తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా గుండుగొలను గ్రామంలో (అప్పట్లో కృష్ణా జిల్లాలో ఉండేది) 1880 నవంబర్ 24న అతి సామాన్య కుటుంబంలో డాక్టర్. భోగరాజు పట్టాభి సీతారామయ్య జన్మించారు. ఉపకార వేతనాలతోనే ఆయన ఉన్నత చదువులు అభ్యసించారు. 1901లో మద్రాస్ మెడికల్ కళాశాలలో వైద్య విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత మచిలీపట్నం (బందరు)లో వైద్యుడిగా ప్రాక్టీసు చేయడం ప్రారంభించారు. అలా లక్ష రూపాయలు పోగుచేసి 1923 నవంబర్ 20న ఆయన ఆంధ్రాబ్యాంకును స్థాపించారు. ఆంధ్రాబ్యాంకుతో పాటు భోగరాజు పట్టాభి సీతారామయ్య 1915లో కృష్ణా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకును కూడా ఏర్పాటు చేశారు. మహాత్మా గాంధీతో అత్యంత సన్నిహితంగా ఉన్న ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. గాంధీతో కలిసి అనేక కార్యక్రమాలలో తన వంతు పాత్రను పోషించారు. గాంధీ చేపట్టిన సత్యాగ్రహం ఉద్యమంలోనూ ఆయన పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టయ్యారు. కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. పట్టాభి సీతారామయ్య స్వయంగా రచయిత. 'జన్మభూమి' అనే పత్రికను ఆయన నిర్వహించారు. భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రను ప్రామాణికంగా అక్షరబద్ధం చేసిన తొలివ్యక్తి కూడా ఆయనే.

1928లో ఏర్పాటు చేసిన భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజన సంఘానికి ఆయన అధ్యక్షులుగా పనిచేశారు. స్వతంత్ర భారతదేశంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ తొలి అధ్యక్షుడు కూడా ఆయనే. 1948లో జరిగిన సదస్సులో పట్టాభిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 1952 నుంచి 1957 వరకు మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఆయన పనిచేశారు. 79 ఏళ్ల వయసులో 1959 డిసెంబర్ 17న కన్నుమూశారు.

# పర్యావరణాన్ని రక్షించండి : సీఎం

(మొదటిపేజీ తరువాయి)

పార్కులు, రెండు జులాజికల్ పార్కులు, ఒక టైగర్ రిజర్వ్, ఒక ఎనుగు రిజర్వ్ అడవులు మన రాష్ట్రంలో ఉన్నాయి. ఇవన్నీ మన రాష్ట్రంలో ఉన్నాయి కదా అని గొప్పగా ఫీల్ కావాలా? లేక మొత్తం భూభాగంలో మూడింతల్లో ఒక భాగం అడవులు ఉండాలని జాతీయ అడవుల విధానం చెబుతున్నప్పుడు 33 శాతం ఉండాల్సిన అడవుల్లో మన రాష్ట్రంలో కేవలం 23 శాతం మాత్రమే ఉన్నాయని భాధపడాలో ఆలోచించుకోవాలి. అశోకుడి గురించి మనం వింటుంటాం. ఆయన గొప్ప చక్రవర్తి అని విన్నాం. రోడ్డుకు ఇరువైపు చెట్లను నాటించాడు కాబట్టే అశోకుడు గొప్ప చక్రవర్తి అయ్యాడు. ఆయన నాటించిన చెట్లు వందల సంవత్సరాలు బతికాయి, తరువాత తరాలకు మేలు చేశాయి.

**25 కోట్ల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టాం**

పర్యావరణం బాగుంటేనే మనమంతా కూడా బాగుంటాం. వీటిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన రాష్ట్రంలో 2351 వృక్షజాతులు, 1461 జంతు జాతులు ఉన్నాయి. రాష్ట్రంలో కొన్ని జంతువులు, మొక్కలు అంతరించి పోతున్నాయి. మనం డైనోసార్స్ గురించి వింటుంటాం. ఇవి ఇప్పుడు కనిపించడం లేదు. ప్రపంచంలో ఇవాళ పరిస్థితి ఎలా ఉందంటే..పులులు అంతరించిపోతున్నాయి. పులుల సంఖ్య రాష్ట్రంలో కేవలం 48 మాత్రమే ఉన్నాయి. ఈ ఏడాది ఆరు పెరిగాయని సంబరాలు చేసుకుంటున్నాం. ఒక్కసారి ఆలోచన చేయండి. వీటిని గురించి మనం పట్టించుకోవడం మానేస్తే పులులు, సింహాలు ఏవి కూడా ఉండవు. మన రాష్ట్రాన్ని కాపాడుకునే దిశగా అడుగులు వేస్తూ..రాష్ట్రంలో 25 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీకారం చుడుతున్నాం. ఇప్పటిదాకా నాలుగు కోట్ల మొక్కలు నాటాం. ఈ ఒక్క రోజు కోటి మొక్కలు నాటబోతున్నాం. ప్రతి ఒక్కరు ఒక్క మొక్క నాటడం కాదు. ప్రతి ఒక్కరు మూడు, నాలుగు మొక్కలు నాటాలి. అప్పుడే మన రాష్ట్రాన్ని కాపాడుకోగలుతామని గుర్తు ఎరగాలి. రాష్ట్రంలో గ్రామ వాలంటీర్ల ద్వారా పంపిణీ కార్యక్రమం చేపడుతున్నాం. గ్రామ వాలంటీర్ల చేత మొక్కల పెంపకం నాటే కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నాను. నీడనిచ్చే మొక్కలు, టేకు మొక్కలు, ఎర్రచందనం మొక్కలు 12 కోట్లు మొక్కలు నాటేందుకు అటవీ శాఖ సిద్దంగా ఉంది.

**దశల వారిగా 10వేల ఎలక్ట్రిక్ బస్సులు తెస్తాం**

ఇవాళ ఫార్మా పరిశ్రమల గురించి మాట్లాడుతున్నాం. పరిశ్రమలు వచ్చేసమయంలో పర్యావరణానికి మేలు చేస్తుందా? అన్నది ఆలోచన చేయాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డును ప్రక్షళన చేయబోతున్నామని చెబుతున్నాను. ఫార్మా రంగంలో లక్ష టన్నుల కాలుష్యం వస్తుందని నా దృష్టికి వచ్చింది. కేవలం 30 వేల టన్నులు మాత్రమే ఆడిట్ జరుగుతుందని, మిగతాది కాల్చివేయడం, లేదా సముద్రంలో వేయడం జరుగుతుంది. పరిశ్రమల్లో ఎంత కాలుష్యం వస్తుంది. ఏ రకంగా మనం డిస్పోజ్ చేయాలో ఆలోచన చేయాలి. ప్రభుత్వమే బాధ్యత తీసుకోబోతోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయబోతున్నాం. ఈ ఏడాది అక్షరాల ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో 100 ఎలక్ట్రిసిటీ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం. దశల వారిగా 10 వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తాం. నీరు, నేల, నింగి, గాలి వీటన్నిటిని కూడా కాలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వీటిని కాపాడుకుందాం' అని సీఎం జగన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# 2న ఇడుపులపాయకు ముఖ్యమంత్రి జగన్



**రాజధాని వార్తలు, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబర్ 2వ తేదీన వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయకు వెళ్లనున్నారు. తన తండ్రి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పదో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విజయవాడలో సోమవారం ఉదయం బయల్దేరి ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడ వైఎస్ సమాధి వద్ద వర్ధంతి సందర్భంగా జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని అదే రోజు సాయంత్రానికి విజయవాడకు తిరిగి వస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

# గ్రామ సచివాలయ పరీక్షలకు అంతా సిద్ధం

**రాజధాని వార్తలు, అమరావతి :** ఆదివారం నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగాలకు పరీక్షలు



నిర్వహించనున్నారు. వచ్చే నెల 8 వరకు రాత పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు పంచాయతీరాజ్ శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. నాగార్జున యూనివర్సిటీలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌ను పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి ద్వివేది పరిశీలించారు. ఒకే సారి లక్షా 26 వేల 728 పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేశారు. పరీక్షలకు 21 లక్షల 69 వేల 719 మంది అభ్యర్థుల దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల కోసం బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు హెల్ప్‌లైన్ సెంటర్ల ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనుంది.

**21,69,719 మంది అభ్యర్థులు**

ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి 13,057 ఉద్యోగాలు కొత్తగా రానున్నాయి. ఈపోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 2,06,211 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రధానంగా సెప్టెంబరు 1న జరిగే పరీక్ష నిర్వహణ పరంగా కీలకమయినది.

# జై జై గణేషా...

**శుక్లాంబరధరం విష్ణు: శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనంధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే**
**అగజానన పద్మార్కం గజాననమవార్నిశం**
**అనేకదం తం భక్తానాం ఏకదంతం ఉపాస్మహే...**

వినాయక చవితి భారతీయ పండుగలలో ఒకటి. పార్వతీపరమేశ్వరుల పుత్రుడైన వినాయకుడి పుట్టిన రోజు. పురాణ గాథలలో శివుడు వినాయకుడిని అందరు దేవతలలోకి మిన్నగా ప్రకటించిన రోజు. వినాయకుని జ్ఞానానికి, సంపత్తుకి మంచి అదృష్టానికి దేవతగా మరియు ప్రయాణం ప్రారంభించేటప్పుడ, లేక కొత్త పనులు చేపట్టేటప్పుడు ప్రార్థించటం సర్వసాధారణం. ఈ పండుగ బాధ్రపద మాసంలో శుక్ల చతుర్థి నాడు ఈ పండుగ జరుపుతారు.

**పూజా విశేషాలు**

వినాయక చవితి నాడు విఘ్నేశ్వరుడిని 21 రకాల ఆకులతో పూజిస్తారు. 1. మాచీ పత్రం/మాచ పత్రి 2. దూర్వా పత్రం/గరిక 3. అపామార్గ పత్రం/ఉత్తరేణి 4. బృహతీ పత్రం/ములక 5. దత్తూర పత్రం/ఉమ్మెత్త 6. తులసీ పత్రం/తులసి 7. బిల్వ పత్రం/మారేడు 8. బదరీ పత్రం/రేగు 9. చూత పత్రం/మామిడి 10. కరవీర పత్రం/గన్నేరు 11. మరువక పత్రం/ధవనం, మరువం 12. శమీ పత్రం/జమ్మి 13. విష్ణుతకాంత పత్రం/ 14. సింధువార పత్రం/వావిలి 15. అశ్వత్థ పత్రం/రావి 16. దాడిమీ పత్రం/దానిమ్మ 17. జాజి పత్రం/జాజిమల్లి 18. అర్జున పత్రం/మద్ది 19.దేవదారు పత్రం 20. గండలీ పత్రం/లతాదూర్వా 21. అర్క పత్రం/జిల్లేడు.

**ఇది మనందరి పండుగ**

హిందూ పండుగలలో ఒక్కో పండుగకు ఒక్కో విశేషం వుంది. ఏటా భాద్రపద శుద్ధచవితినాడు వచ్చే వినాయకచవితి మనందరి పండుగ.

హిందూ సాంప్రదాయం ప్రకారం వినాయకుడు సకల దేవతా గణానికి అధిపతి (గణనాయకుడు), అన్ని పూజలకు ప్రప్రథమంగా పూజింపవలసినవాడు. అందుకే ప్రతి శుభకార్యానికి, పూజకు మొదటిగా మనం గణపతి పూజతోనే ప్రారంభిస్తాం. అది పిల్లవాడి బారసాల, విద్యాభ్యాసం నుండి, వివాహం, శంకుస్థాపన, గృహ ప్రవేశం, వ్యాపార ప్రారంభోత్సవాలు, నూతన వాహనం కొనుగోలు ఇలా ఒక సందర్భం ఏమిటి మానవ జీవితంలో ప్రతి ప్రధానమైన శుభకార్యానికి మొదటిగా గణపతిని పూజించటం అనాదిగా సాంప్రదాయం.

ఇలా మన ప్రతి పని విజయానికీ, చదువుకు, జ్ఞానానికీ దిక్కైన దేవుడు మన వినాయకుడు. ముందుగా వినాయకుడిని సంతోష పెడితే ఆటంకాలు రాకుండా, కష్టాలు దూరమై, సకల కార్యాలు పొంది, ఐశ్వర్యాలు సిద్ధస్తాయని ప్రజల విశ్వాసం. భాద్రపదశుద్ధ చవితినాడు వినాయకుడు జన్మించినది. అన్ని విఘ్నాలపై ఆధిపత్యం జరిగినట్లుగా పురాణాల బట్టి పండితుడు తెలుపుతున్నందున మన దేశంతోపాటు ఇతర దేశాలలోని వారు కూడా ప్రతి సంవత్సరము భాద్రపదశుద్ధ చవితినాడు, బంగారం, వెండి మట్టితో తయారుచేసిన ప్రతిమలకు కుటుంబ సభ్యులు అందరూ పూజించటం వల్ల మంచి ఫలితాలు



అందుతాయని పురాణకథలు తెలుపుచున్నాయి.

చవితిరోజున వినాయకుడు దగ్గర పండ్లు, పూలు, పత్రి అని పిలుచుకునే రకరకాల మొక్కల ఆకులు, పిండివంటలను వుంచి భక్తి శ్రద్ధలతో పూజిస్తూ ఆ దేవదేవుని గణగణాలను కీరిస్తాం, మనం మొదలుపెట్టే ప్రతిపనిలో ఎటువంటి విఘ్నాలు లేకుండా విజయం చేకూర్చాలని, జ్ఞానసిద్ధికోసం ప్రార్థిస్తాం.

## విభేదాలు సృష్టిస్తున్న టీడీపీ



**రాజధాని వార్తలు, అమరావతి :** రాజధాని అమరావతిని తరలించవద్దని ప్రతిపక్షాలు, ఉభయ కమ్యూనిస్టులు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోరుతున్నారు. అధికారికంగా వైయస్సార్‌సీపీ ప్రభుత్వం రాజధానిని తరలిస్తామని చెప్పలేదని స్థానిక రైతు నాయకులు చెప్తుతు న్నారు. ఇది కేవలం టీడీపీ నాయకులు కావాలనే రభస చేస్తున్నారని, అనవసరమైన విభేదాలు సాధారణ ప్రజల మధ్య, ఎన్నికైనా ప్రజా ప్రతినిధుల మధ్య కలిగించటానికి ప్రయత్నిస్తున్నారని స్థానికులు చెప్తుతున్నారు. ఇటీవల జరిగిన ఒక చిన్న అంశాన్ని తీసుకుని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మధ్య విభేదాలు ఉన్నాయని ప్రజలను నమ్మించి తద్వారా పరిపాలన భాగలేదని తెలుగు తమ్ముళ్ల ప్రయత్నం చేయడం మంచిది కాదని నియోజకవర్గ ప్రజలు చెప్తుతున్నారు. అయితే వీళ్లిద్దరూ వైయస్ఆర్‌సీపీ పార్టీ కార్యకలాపాలలో ఎంతో సామరస్యంగా పాల్గొని ప్రజలకు సేవలందిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు చెప్తుతున్నారు.

# కొత్త వాహన చట్టం

- **పిల్లలకూ హెల్మెట్..**
- **ఇకపై భారీ ఫైన్**

న్యూఢిల్లీ : కొత్త మోటార్ వెహికిల్స్ సవరణ చట్టం -2019 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలవుతోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం బుధవారం (ఆగస్ట్ 28) వెల్లడించింది. కొత్త MV యాక్ట్‌లోని 28 నిబంధనల్ని అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. మిగిలిన సెక్షన్లకు సంబంధించిన డ్రాఫ్ట్ నిబంధనల్ని రూపొందించి, అభిప్రాయ సేకరణ తర్వాత అమలు చేస్తామని కూడా చెప్పింది. మొదట రోడ్డు ప్రమాద నియంత్రణకు సంబంధించిన నిబంధనలు ఎక్కువగా అమల్లోకి తీసుకు వస్తున్నారు.

**కొత్త మోటార్ చట్టం ప్రకారం భారీగా జరిమానా..**

కొత్త మోటార్ చట్టం ప్రకారం జరిమానాలు భారీగానే ఉన్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే రూ.500 నుంచి రూ.10,000 వరకు జరిమానా, ఆరు నెలల పాటు జైలు శిక్ష విధించే అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ లోడుతో వెళ్లే వెహికిల్స్ పైన రూ.20వేల జరిమానా ఉంటుంది. అలాగే ప్రతి అదనపు టన్నుకు రూ.2వేల చొప్పున ఫైన్ ఉంటుంది. పైగా అదనంగా ఉన్న బరువును దించే వరకు ఆ వాహనాన్ని వెళ్లనివ్వరు.

**ఎక్కువమంది ప్రయాణీకులు ఉంటే..**

వాహనాల్లో నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువమంది ప్రయాణీకులను ఎక్కించుకునే వాహనాలకు ఒక్కొక్క ప్రయాణీకుడి పైన రూ.200 చొప్పున ఫైన్ విధిస్తారు. అదనపు ప్రయాణీకులకు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యం కల్పించిన అనంతరం సదరు వాహనాన్ని ముందుకు కదలనిస్తారు.

**నాలుగేళ్లు దాటిన పిల్లలకూ హెల్మెట్**



కారులో సీటు బెల్టు ధరించని వారికి రూ.1,000 జరిమానా విధిస్తారు. బైక్ పైన వెళ్లే సమయంలో నాలుగేళ్లలోపు పిల్లలు కూడా హెల్మెట్ ధరించాలి. మైనర్లు బండి నడిపితే తల్లిదండ్రులు లేదా సంరక్షకులదే బాధ్యత. ప్రమాదకర డ్రైవింగ్, రాంగ్ రూట్, స్పీడ్ డ్రైవింగ్‌కు పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తారు.

**2017లో ప్రమాదాలు**

2017లో ఓవర్ స్పీడింగ్ వల్ల 3,27,448, రాంగ్ సైడ్ డ్రైవింగ్ 29,148, డ్రంక్ అండ్ డ్రైవింగ్ వల్ల 14,071, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ 8,526, రెడ్ సిగ్నల్ జంపింగ్ వల్ల 6,324, ఇతర నిబంధనల ఉల్లంఘన వల్ల 79,394 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో వల్ల ఓవర్ స్పీడ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ ఉపయోగం, రెడ్ సిగ్నల్ జంప్, ఇతర నిబంధనల వల్ల వరుసగా... 98,613, 9,527, 4,776, 3,172, 1,826, 29,999 మంది చనిపోయారు. మొత్తం 1,47,913 మంది మృత్యువాత పడ్డారు. గాయపడ్డవారు 4,70,975 మంది.

**లైసెన్స్ లేకుంటే...**

కొత్త మోటారు వాహన చట్టం ప్రకారం జనరల్ (1778) జరిమానా ప్రస్తుతం రూ.100 ఉండగా, కొత్త జరిమానా రూ.500

రోడ్డు నిబంధనల ఉల్లంఘన (177ఏ) రూ.100 నుంచి రూ.500కు పెంపు

టిక్కెట్ లేని ప్రయాణం (178) రూ.200 నుంచి రూ.500

అధికారుల ఆదేశాల ధిక్కరణ (179) రూ.500 నుంచి రూ.2000

అనుమతి లేకుండా వాహనం నడపడం (180) రూ.1000 నుంచి రూ.5,000

లైసెన్స్ లేని డ్రైవింగ్ (181) రూ.500 నుంచి రూ.5,000

అర్హత లేని వాహన డ్రైవింగ్ (182) రూ.500 నుంచి రూ.10,000

అనుమతి లేని భారీ పరిమాణ వాహనం నడిపితే (182బీ) రూ.5,000 ఫైన్ విధిస్తారు.

స్పీడ్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ ఫైన్

స్పీడ్ డ్రైవింగ్ (183) రూ.400 నుంచి రూ.1000 నుంచి రూ.2000 వరకు

లైట్ మోటార్ వెహికిల్స్ అయితే రూ.1,000. మధ్యస్థాయి వాహనాలు అయితే రూ.2,000

ప్రమాదకర డ్రైవింగ్ (184) రూ.1,000 నుంచి రూ.5,000 వరకు

డ్రంకన్ డ్రైవింగ్ (185) రూ.2,000 నుంచి రూ.10,000

లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘనకు ఇక నుంచి రూ.25,000 నుంచి రూ.1,00,000 వరకు ఫైన్ విధిస్తారు.

**సీటు బెల్ట్ ధరించకుంటే..**

వాహనంపై అధిక లోడు (194) ఇదివరకు రూ.2,000 ఫైన్ - ప్రతి అదనపు టన్నుపై రూ.1,000గా ఉండేది. ఇక నుంచి రూ.20,000 జరిమానా. ప్రతి అదనపు టన్నుపై రూ.2,000. - సీటు బెల్టు లేకుంటే (194బీ) రూ.100 నుంచి రూ.1,000కి పెంచారు. - బైక్ పైన ఎక్కువ మంది ప్రయాణిస్తే (194సీ) రూ.100 నుంచి రూ.2,000 వరకు జరిమానా మరియు మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు. అలాగే ఎమర్జెన్సీ వాహనాలకు దారి ఇవ్వకుంటే.. - ఎమర్జెన్సీ వాహనాలకు దారి ఇవ్వకుంటే (194ఈ) రూ.10,000 జరిమానా వేస్తారు. - ఇన్సురెన్స్ లేని వాహనాలకు ఇదివరకు రూ.1000 ఉండగా, ఇక నుంచి రూ.2000 వసూలు చేస్తారు. - పిల్లలు వాహనం నడిపితే ఇక నుంచి వాహన యజమాని లేదా సంరక్షకుడిని అపరాధిగా భావిస్తారు. రూ.25వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం. బాల నేరస్థుల కింద వాహనం నడిపిన బాలలకు శిక్ష. వాహన రిజిస్ట్రేషన్ రద్దు. - అధికారులు అడిగిన డాక్యుమెంట్స్ చూపించకుంటే (206) వివిధ సెక్షన్ల కింద డ్రైవింగ్ లైసెన్స్ రద్దు అధికారులపై ఒత్తిడి తెస్తే (210బీ) సంబంధిత సెక్షన్ కింద ఇప్పుడున్న జరిమానాకు రెట్టింపు.

## రుణ ప్రణాళిక సిద్ధమవుతోంది

- **1 నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ**
- **మంత్రి పినిపే విశ్వరూప్**

**రాజధాని వార్తలు, అమరావతి :** ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా ఆయావర్గాల్లోని పేదలకు రుణాలిచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి సెప్టెంబర్ 1నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఎస్సీ కార్పొరేషన్ ఆ దిశగా అడుగులు వేస్తోంది. గత ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు

చోటు చేసుకున్నాయని ఉన్నతాధికారులు గుర్తించారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా వ్యవహరించిన జూపూడి ప్రభాకర్‌రావు ఇష్టానుసారం వ్యవహరించి నందున నిజమైన దరఖాస్తుదారులకు రుణాలు అందలేదు. మాదిగలకు రుణాలు ఇవ్వలేవదని కూడా దళిత సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. ఎన్నికల ముందు మున్సిపాలిటీల్లో చెత్తను తరలించే పవర్ ఆటోలు, కాలు వల్లో మురుగు తొలగించే క్లీనింగ్ యంత్రాలు, ట్రాక్టర్లను ఎస్సీ కార్పొరేషన్ ఇబ్బడి ముబ్బడిగా కొనుగోలు చేసింది. ప్రస్తుతం అవన్నీ మూలనపడి ఉన్నాయి. ఈ పరిస్థితిపై వివరాలు సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను రద్దు చేసింది. సెప్టెంబర్ 1 నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించింది. ఎస్టీ కార్పొరేషన్ కూడా రుణాల మంజూరుకు సంబంధించి యాక్షన్ ప్లాక్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. మరో 20 రోజుల్లో ఇది పూర్తవుతుందని ఎస్టీ కార్పొరేషన్ ఎండీ రవీంద్రబాబు చెప్పారు. రుణాలకు సంబంధించి అక్టోబర్‌లో దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది. బీసీలకు సంబంధించి 29 కార్పొరేషన్లు ఉండగా.. రుణ



ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. బీసీలకు ఆదరణ పథకం కింద వృత్తి పనిముట్లు అందించాలని భావించాన బీసీ కార్పొరేషన్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పంపిణీ మొదలు పెట్టింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కొంత మందికి ఇచ్చి, కొందరికి ఇవ్వలేదు. ఇవ్వలేదు. ఇవ్వని వస్తువులన్నీ గోడౌన్‌లో మూలుగుతున్నాయి. బెనిఫిషరీ కాంట్రిబ్యూషన్ కింద రూ2 వేల వంతున ప్రభుత్వం అప్పట్లో ఎంపికైన అబ్దిదారుల నుంచి సేకరించినా పనిముట్లు ఇవ్వలేదు. అలాంటి వారి విషయంలో ఏం చేయాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



**రాజధాని వార్తలు :** గుంటూరు రూరల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాలబాలి కలకు వారి రక్షణ, సంరక్షణపై అవగాహ నా సదస్సు రాయపూడిలో జరిగింది.

## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- **రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ**



**రాజధాని వార్తలు, గుంటూరు :** రాష్ట్రంలో మహిళలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ హెచ్చరించారు. కమిషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మొట్టమొదటిసారిగా గుంటూరు వికాస్ నగర్‌లోని మహిళా కమిషన్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలపై దాడుల కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించి బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామన్నారు. ముఖ్యంగా పురుషుల ఆలోచన విధానం మార్పుగలిగితే మహిళలపై దాడులు నివారించవచ్చన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. మహిళా కమిషన్‌పై మహిళలకు మంచి ఆదరణ కలిగించే విధంగా షెడ్యూల్‌తో కూడిన క్యాలెండర్ రూపొందించి దాని ప్రకారం పనిచేస్తామన్నారు. అన్ని జిల్లాల్లో పర్యటించి మహిళల స్థితిగతులను తెలుసుకుని, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా వారి అభివృద్ధికి కావాల్సిన సూచనలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. మహిళలపై దాడులు జరగడానికి సినిమాలు, సీరియల్స్ ప్రభావం కూడా ఎక్కువగా ఉందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సినీ ఇండస్ట్రీ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

**ప్రేమికుల జంటకు అండగా ఉంటాం**

కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రాంతానికి చెందిన ఎస్సీ అమ్మాయి, బీసీ అబ్బాయి ప్రేమించి వివాహం చేసుకుంటే వారిని వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో పాటు ఎక్కడా పనిచేసుకోనివ్వకుండా వేధిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ దగ్గరకు ఓ ప్రేమ జంట వచ్చిందని.. ఆ కేసు విజయమ్మ తనకు అప్పగించారని వాసిరెడ్డి పద్మ తెలిపారు. విజయమ్మ ఇచ్చిన మొట్టమొదటి కేసును పరిశీలించి వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు ప్రభుత్వపరంగా బాధిత జంటకు అండగా ఉంటామన్నారు.

**తప్పు చేయాలంటే భయపడేలా శిక్షలు**

తప్పు చేసిన వ్యక్తికి అతి తక్కువ సమయంలోనే శిక్షపడే విధంగా చర్యలు తీసుకుంటామని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ వెల్లడించారు. గుంటూరులోని మహిళా కమిషన్ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో ఆమె మాట్లాడారు. తప్పు చేసిన వ్యక్తి మళ్లీ చేయకుండా భయపడేలా శిక్ష ఖరారు చేయాలని సిఫార్సు చేస్తామన్నారు. వారంలో ఒకరోజు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీలు స్వీకరిస్తామన్నారు. నెలకో జిల్లా వంతున 13 జిల్లాల్లో పర్యటిస్తామని వివరించారు. మహిళా కమిషన్ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా త్వరలో తాడేపల్లికిగానీ, విజయవాడకు గానీ తరలిస్తామన్నారు. వైఎస్ విజయమ్మ సూచించిన కేసును పరిగణనలోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. కృష్ణా జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్నారని బంధువులు వేధిస్తున్న వ్యవహారంలో బాధితులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కార్యదర్శి నిర్మల, డైరెక్టర్ సూయజ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కొరకు అవగాహనా సదస్సు



**రాజధాని వార్తలు, రాయపూడి :** రాయపూడి గ్రామంలో వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామ ప్రజలకు, పంచాయితీ సిబ్బందికి, శానిటేషన్ సిబ్బందికి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి ప్రతిమలను మాత్రమే వాడాలి అని సింథటిక్ , ఫాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మలు వాడకుండా, నీటిని కలుషితం చేయకుండా ఉండమని ఒక అవగాహన సదస్సును జరిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు, పంచాయితీ కార్యదర్శి గాదె వెంకటప్పయ్య, సిఆర్‌డిఏ సూపర్‌వైజర్ పప్పల సుకుమార్ పాల్గొన్నారు.

## ఆర్టీసీలో 1000 ఎలక్ట్రిక్ బస్సులు

**రాజధాని వార్తలు, అమరావతి :** అతి త్వరలో రాష్ట్రంలో రోడ్లపై విద్యుత్ బస్సులు పరుగులు తీయనున్నాయి. ఈ బస్సులతో గాలి, ధ్వని కాలుష్యం తగ్గనుంది. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఏపీకి 300 విద్యుత్ బస్సులను కేటాయించింది. డీజిల్ ధరల పెరుగుదలతో ఆర్టీసీ ఏటా రూ.300 కోట్ల వరకు నష్టాల్ని చవిచూస్తోంది. దీంతో ఇప్పటివరకు డీజిల్, సీఎన్‌జీ బస్సులను నడుపుతున్న ఆర్టీసీ నిర్వహణ వ్యయం



తగ్గించేందుకు విద్యుత్ బస్సులను నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలే విద్యుత్ బస్సుల నిర్వహణపైన నిపుణుల కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. డీజిల్ బస్సులు నడపడం వల్ల కిలోమీటరుకు డ్రైవర్ జీతభత్యంతో కలిపి రూ.38 వరకు ఖర్చవుతుంది.

అదే విద్యుత్ బస్సు నిర్వహణ ఖర్చు కిలోమీటరుకి రూ.19 వరకే అవుతుందని నిపుణుల కమిటీ తేల్చింది. కేంద్ర ప్రభుత్వం ఫేమ్-2 (ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇన్ ఇండియా) పథకం కింద దేశంలో 64 నగరాలకు 5,595 విద్యుత్ బస్సులను మంజూరు చేయగా, ఏపీకి 300 విద్యుత్ బస్సులు కేటాయించింది. విశాఖపట్నంకు వంద, విజయవాడ, అమరావతి, తిరుపతి, కాకినాడలకు 50 చొప్పున మంజూరు చేశారు. ఒక్కో బస్సు ఖరీదు రూ.2.18 కోట్ల వరకు ఉండగా.. కేంద్రం 40% రాయితీ ఇవ్వనుంది. విద్యుత్ బస్సులో సీసీ కెమెరాలు, 31 సీట్ల సామర్థ్యం, ఆటోమేటిక్ గేర్లు ఉంటాయి. రెండు గంటలు చార్జింగ్ చేస్తే నిరంతరాయంగా ఏడు నుంచి ఎనిమిది గంటలు బస్సు నడుస్తుందని ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.


## హెచ్ - 213 ది నూతక్కి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నూతక్కి

E- mail : pacsnutakki@gmail.com

ది.01-04-2018 నుండి డిపాజిట్లపై చెల్లించు వడ్డీ రేట్లు

1. సేవింగ్స్ డిపాజిట్లపై 3%

**ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

2. 15రోజుల నుండి 30 రోజుల వరకు 3.50%
3. 31 రోజుల నుండి 45 రోజుల వరకు 4%
4. 46 రోజుల నుండి 90 రోజుల వరకు 5.00%
5. 91 రోజుల నుండి 179 రోజుల వరకు 6%
6. 180 రోజుల నుండి 1 సంవత్సరంలోపు 7%
7. 1 సంవత్సరం నుండి 2 సంవత్సరాల లోపు 8%
8. 2 సం॥ల నుండి 3 సం॥లవరకు 9%
9. 6 సంవత్సరాలకు రెట్టింపు

## నెల నెలా పొదుపు చేయు పథకములు

| వ. నెం. | నెలలు | చెల్లించు వడ్డీ రేటు | 1 రూపాయికు చెల్లించు వడ్డీ | 50 రూ॥కు | 100 రూ॥కు | 200 రూ॥కు | 300 రూ॥కు | 500 రూ॥కు | 1000 రూ॥కు | 1500 రూ॥కు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 12కి | 7% | 12.4625 | 623 | 1246 | 2492 | 3738 | 6231 | 12462 | 18693 |
| 2 | 24కి | 8% | 26.0922 | 1305 | 2609 | 5218 | 7828 | 13046 | 26092 | 39138 |
| 3 | 36కి | 9% | 41.4188 | 2071 | 4142 | 8284 | 12426 | 20709 | 41419 | 62128 |
| 4. | 48కి | 9 1/2% | 58.4867 | 2924 | 5849 | 11697 | 17546 | 29243 | 58487 | 87730 |
| 5. | 60కి | 10% | 77.9112 | 3896 | 7791 | 15582 | 23373 | 38956 | 77911 | 116867 |

**సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :**

**సంఘం- 08645275239, సి.ఇ.ఓ- 8331036666**

# ఈ నరకం భరించలేం..

# మమ్మల్ని కాల్చి చంపేయండి

- లాఠీలు, కేబుల్ వైర్లతో చితకబాదుడు
- స్పృహ తప్పితే కరెంట్ షాక్
- కాశ్మీర్‌లో సైన్యం దాష్టీకం

**ఆర్టికల్ 370 రద్దు తర్వాత కాశ్మీర్ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయింది. ఏ క్షణం ఎవరి ఇంట్లో సైన్యం చొరబడి ఎవరిని తీసుకు వెళుతుందో తెలియని పరిస్థితి. అలా వెళ్లిన యువకులను లాఠీలు, కేబుల్ వైర్లతో ఇష్టం వచ్చినట్లు కొట్టడమే కాకుండా స్పృహ కోల్పోయిన వారికి ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చి మళ్లీ స్పృహలోకి తెస్తున్న విషయం బట్టబయలైంది. దెబ్బలు భరించలేని యువకులు మమ్మల్ని కొట్టవద్దు కాల్చి చంపండని వేడుకుంటున్నారు.**

**శ్రీనగర్ :** కాశ్మీర్ మూడు వారాలకుపైగా సైన్యం పహారాలో ఉంది. కేంద్రం 10 వేల మంది అదనపు బలగాలు అక్కడ మోహరించింది. దాదాపు 3వేల మంది రాజకీయ నాయకులు, హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులు, వ్యాపారులు, పౌరులను నిర్బంధించింది. వీరిలో చాలా మందిని ఇతర రాష్ట్రాల జైళ్లకు తరలించారు. ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్న ఈ రాష్ట్రాన్ని





ఈనెల 5న జమ్మూ, కాశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత రాష్ట్రాలుగా విభజించినప్పటి నుంచి అక్కడి ప్రజల పరిస్థితి మరింత దిగజారింది. దక్షిణ కాశ్మీర్ జిల్లా గ్రామాల్లో రాత్రిళ్లు సైన్యం ఇంటింటికీ సోదాలు నిర్వహించి యువకులను నిద్రనుంచి తీసుకు వచ్చి, తీవ్రంగా కొడుతూ, హింసిస్తున్నారు. డాక్టర్లు, ఆరోగ్య శాఖాధికారులు దీనిపై ప్రశ్నిస్తే పెదవి విప్పడం లేదు. రాత్రి నిద్రపోతుండగా తమను సైన్యం తీసుకు వెళ్లి తీవ్రంగా కొట్టారని ఇద్దరు సోదరులు తెలిపారు. అయితే పేర్లు వెల్లడించవద్దనే షరతుపై వారు హింసాత్మక ఘటనలను వెల్లడించారు. వారి దెబ్బలకు తాళలేక ఎందుకు కొడుతున్నారని అడిగామని అయితే దానికి సమాధానం చెప్పకుండా మరింతగా కొట్టారని, నా శరీరంలో దెబ్బలు లేని ప్రదేశం లేదన్నారు. బూట్ల కాళ్లతో కొట్టారు, కర్రలతో బాదారు, కేబుల్ వైర్‌తో ఇష్టం వచ్చినట్లు కొట్టారు. కాళ్ల వెనుక కూడా కొట్టారు .. ఆ దెబ్బలకు స్పృహకోల్పోతే విద్యుత్‌షాక్‌లు ఇచ్చి మమ్మల్ని స్పృహలోకి తెచ్చారని, ఈ దెబ్బలు భరించలేక తమను కొట్టవద్దు, కాల్చి చంపండి అని వేడుకొన్నామన్నారు. మరో గ్రామస్తుడు మాట్లాడుతూ రాళ్లు విసిరిన వారి పేర్లు చెప్పాల్సిందిగా కొట్టారన్నారు. తనకు తెలీదు అని చెప్పగానే చొక్కా తీసి ఇనుప రాడ్లతో, కర్రలతో రాత్రంతా కొడుతూనే ఉన్నారన్నారు. గ్రామాల్లో ఎవరైనా నిరసన ప్రదర్శన నిర్వహిస్తే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుందని సైన్యాధికారులు తమను హెచ్చరించాడని ఆ యువకుడు తెలిపాడు. దీంతో నిరసన నిర్వహించడానికి కూడా భయపడుతున్నారన్నారు. గొడ్డును బాదినట్లు బాదితే ఇంట్లో నుంచి పారిపోవడం మినహా చేసేది ఏమీ లేదన్నారు. దీనిపై మరొక యువకుడు స్పందించి, తన గాయాలను చూపుతూ 15 మంది సైనికులు తుపాకీ, కేబుల్ వైర్లు, కర్రలు, ఇనుప రాడ్లతో కొట్టారని, స్పృహతప్పి పడిపోతే గడ్డం పట్టుకు బలంగా లాగారని నా పళ్లు ఊడిపోతాయేమో అన్నంత బాధను అనుభవించానన్నారు. నేను స్పృహ కోల్పోయినప్పుడు వారు నా గడ్డానికి నిప్పంటించాలని చూశారని అయితే మరొక సైనికుడు అడ్డుకున్నట్లు తనతో ఉన్న మరో యువకుడు చెప్పాడన్నారు. మరొక యువకుడు మాట్లాడుతూ వేర్పాటువాద సంస్థ హిజ్బుల్ ముజాహిద్దీన్‌లో మా అన్న రెండేళ్ల క్రితం చేరాడని అతని ఆచూకీ చెప్పాల్సిందిగా పెట్టిన టార్చర్‌కు కాలు విరిగిందన్నారు. తన చేతులు, కాళ్లు కట్టేసి తల్లకిందులుగా వేలాడదీశారని రెండు గంటలకు పైగా తీవ్రంగా కొట్టారన్నారు. ఈ ఘటనలపై సైన్యం అధికార ప్రతినిధి కల్నల్ అమన్ ఆనంద్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు ఏవీ తమ దృష్టికి రాలేదని, పౌరుల హక్కులు కాపాడేందుకు సరైన చర్యలు చేపడతామన్నారు. కాశ్మీర్‌లో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవహక్కుల హననంపై వివరాలను ఈ ఏడాది మొదటిలో సేకరించామని స్థానికంగా పనిచేసే రెండు మానవ హక్కుల సంస్థలు తెలిపాయి. ఐక్యరాజ్యసమితి స్వతంత్ర దర్యాప్తు కోసం కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ (సీఓఐ)ను ఏర్పాటు చేసి మానవ హక్కుల ఉల్లంఘనపై దర్యాప్తు జరిపి 49 పేజీల నివేదికను అందించగా, భారత్ ఆ నివేదికను ఖండించింది.

## 'కశ్మీర్ పరిణామాలపై ధైర్యంగా మాట్లాడాలనే రాజీనామా : కన్నన్

కశ్మీర్ విషయంలో తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించలేకపోతున్నానంటూ కేంద్రపాలిత ప్రాంతం దాద్రా నగర్ హవేలీలో విధులు నిర్వహిస్తున్న యువ ఐఏఎస్ అధికారి కన్నన్ గోపీనాథన్ (33) తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తాను ప్రభుత్వ విధుల్లో ఉన్నందున, ఆర్టికల్ 370 కింద జమ్ము కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడంపై తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించలేకపోతున్నానని, అందుకే సర్వీసు నుంచి వైదొలగాలన్న నిర్ణయం తీసుకున్నట్లు గోపీనాథన్ చెప్పారు.

ఏడేళ్ల సర్వీసులో వేర్వేరు పోస్టుల్లో విధులు నిర్వహించిన కన్నన్ గోపీనాథన్, స్ఫూర్తివంతమైన పనితీరును కనబరిచారు. మిజోరాంలో నష్టాల్లో కొనసాగుతున్న విద్యుత్ బోర్డును లాభాల్లోకి తీసుకొచ్చారు. విపత్తు నిర్వహణ కోసం యాప్‌ను రూపొందించారు. పుల్లెల గోపీచంద్‌తో కలిసి 30 బ్యాడ్మింటన్ క్రీడా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. 2012 బ్యాచ్‌కు చెందిన గోపీనాథన్ స్వస్థలం కేరళలోని కొట్టాయాం జిల్లా. 2018లో కేరళను వరదలు ముంచెత్తినప్పుడు సాదాసీదా వ్యక్తిగా పునరావాస కేంద్రంలో ఆయన ఎనిమిది రోజులు పనులు చేశారు. ఆయన ఒక ఐఏఎస్ అధికారి అంటూ కొన్ని ఫొటోలు బయటకు రావడంతో గోపీనాథన్ పేరు దేశ ప్రజలకు తెలిసింది. ఆయన సహాయక చర్యల్లో పాల్గొన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేశారు? అని అడిగినప్పుడు, ఆయన స్పందిస్తూ, "నన్ను ఎవరూ బలవంతపెట్టలేదు. నా అంతట నేనే నిర్ణయం తీసుకున్నాను. నేను బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని నా మనసు చెప్పింది. నా అభిప్రాయాలను లోలోపల దాచుకోలేను. దేశంలో ఒకమూలన అనేకమంది ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తుంటే, కనీసం నా అభిప్రాయాలను వెల్లడించలేని పరిస్థితుల్లో విధుల్లో కొనసాగలేను. నా మనసు ఊరుకోవట్లేదు. **ప్రజా సమస్యలపై స్వేఛగా గళమెత్తే వెసులుబాటు ఉండాలన్నది నా వాదన**" అని చెప్పారు. ప్రధాన మంత్రి ఎక్సలెన్స్ అవార్డు కోసం దరఖాస్తు చేయనందుకు, కేరళ వరదల్లో సాదాసీదా వ్యక్తిగా వెళ్లి సహాయ పనులు చేసినందుకు తనకు ఉన్నతాధికారుల నుంచి రెండు మెమోలు వచ్చాయని కన్నన్ తెలిపారు. "ఆ రెండు తాఖీదులకూ నా స్పందన తెలిపాను. అవి పనికిమాలిన మెమోలు. నాకు దేని గురించీ ఆందోళన లేదు" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నారు? అని అడిగినప్పుడు ఆయన మాట్లాడుతూ, "నా రాజీనామా లేఖ మీద నాకు ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పటికైతే నాకు ఎలాంటి ప్రణాళికలు



లేవు. ఇప్పుడు నాకు సర్వీసు నిబంధనలు వర్తిస్తాయి. రాజీనామా ఆమోదం పొందిన తర్వాత నేను మీతో అన్ని విషయాలూ పంచుకోగలను" అని ఆయన చెప్పారు. కన్నన్ నిర్ణయాన్ని మాజీ ఐఏఎస్ అధికారి ఎం.జీ. దేవసహాయం స్వాగతించారు. ఆయన కూడా 1985లో ఇలాగే ఉద్యోగానికి రాజీనామా చేశారు. "నేను కన్నన్‌తో మాట్లాడాను. అభినందించాను. నేను కూడా 1985లో హరియాణాలో ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్నాను. రాజకీయ నాయకుల అవినీతిని సహించలేకపోయాను. రెండో ఆలోచన లేకుండా ఉద్యోగానికి రాజీనామా చేశాను. జీతం కోసం అలాంటి ప్రభుత్వంలో విధులు నిర్వహించడం కంటే, బయటకొచ్చి ప్రజల కోసం పనిచేయడం ఉత్తమం అనిపించింది. అప్పటికి ఇంకా 15 ఏళ్ల సర్వీసు మిగిలి ఉండగానే రాజీనామా చేశాను" అని ఎం.జీ. దేవసహాయం గుర్తు చేసుకున్నారు.

ఐఏఎస్ అధికారులుగా ఒకప్పుడు ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించిన సామాజిక ఉద్యమకారులు అరుణా రాయ్, హర్ష మంధేర్‌లు కూడా ప్రజలకు సేవ చేసేందుకు ఉద్యోగాలకు రాజీనామా చేసిన విషయాన్ని కూడా దేవసహాయం గుర్తు చేశారు. "సమాచార



హక్కు చట్టం కోసం తీవ్రంగా పోరాడిన అరుణా రాయ్ నా బ్యాచ్‌మేట్. ఆమె ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తర్వాత 6 నెలల్లోపే రాజీనామా చేశారు. 2002లో జరిగిన గోద్రా అల్లర్లలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడాన్ని చూసిన తర్వాత హర్ష మందర్ రాజీనామా చేశారు. ఇలా ఐఏఎస్ అధికారులు రాజీనామా చేయడం 1975లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించినప్పటి నుంచే ప్రారంభమైంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల పట్ల మౌనం వహిస్తూ, ప్రభుత్వ విధుల్లో కొనసాగడం నచ్చని చాలామంది అధికారులు ఉద్యోగాలను వదిలేశారు.

## పెద్ద సంఖ్యలో అరెస్టులు

భారత ప్రభుత్వం గత చాలా రోజులుగా కఠిన నిర్ణయాలను అమలు చేసే సామర్థ్యాన్ని ఇప్పటికే చూపించింది. శ్రీనగర్‌లో ఒక అధికారి నాతో "సుమారు 4 వేల మంది అరెస్ట్ అయ్యారు. కానీ ప్రభుత్వం వారి పేర్లతో ఎలాంటి అధికారిక జాబితాను పబ్లిక్ ప్లేసుల్లో ఉంచలేదని" చెప్పారు. భారత్‌కు అండగా నిలిచిన ప్రధాన రాజకీయ పార్టీల నేతలైనా, వేర్పాటువాదులైనా, రాళ్లు రువ్వే మూకలైనా, స్థానిక పార్టీ కార్యకర్తలైనా అందరినీ ఒకే దగ్గర ఉంచారు. భారత జెండా కోసం తమ జీవితాలనే పణంగా పెట్టిన వారిని జైల్లో వేయడం న్యాయమే అని ఎలా అనగలం.

## కశ్మీరీలను రెచ్చగొడుతున్న ఆంక్షలు

అయితే, ఇప్పుడు ఈ ఆంక్షల వల్ల పూర్తిగా వ్యతిరేక ప్రభావం పడుతోంది. స్థానికులు ఒకరితో ఒకరు మాట్లాడుకోలేకపోతున్నారు. చాలాసార్లు వాళ్లు ప్రభుత్వ హెల్ప్‌లైన్ కోసం గంటలు గంటలు క్యూలో నిలబడాల్సి వస్తోంది. అప్పటికీ చాలా మంది తమ పిల్లలతో, అమ్మనాన్నలతో మాట్లాడలేకపోతున్నారు.

చాలాసార్లు వారికి డాక్టర్ల సలహాల అవసరం కూడా ఉంటోంది. కానీ ఆ సాయం అందేలోపే బాగా ఆలస్యం అయిపోతోంది. ఇదంతా ప్రజల్లో కోపాన్ని పెంచుతోంది. కానీ, ఈ కోపానికి 370తో ఎలాంటి సంబంధం లేదు. అంతకంటే దారుణమైన పరిస్థితి ఏంటంటే, కమ్యూనికేషన్ వ్యవస్థ స్తంభించినపుడు, ఇంటర్నెట్ ఆగిపోయినపుడు ఇంకా, కమ్యూనికేషన్ వ్యవస్థపై ఉన్న ఈ ఆంక్షలను కొనసాగించడం పనికిరాని చర్యే అవుతుంది.

## వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి

ఆంక్షలతో కశ్మీర్‌లో వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. జర్నలిస్టులు వార్తలు కూడా రాయలేకపోతున్నారు. "మా ఆదాయ పన్ను కట్టడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు అంతా ఆన్‌లైన్ అవడంతో ఏం చేయలేకపోతున్నాం" అని స్థానికుడొకరు హ్యూమన్ రైట్స్ వాచ్‌కు చెప్పారు. ఇంటర్నెట్‌తో సహా అన్ని మాధ్యమాల ద్వారా స్వేఛగా సమాచార బట్వాడాకు, తమ ఆలోచనలను పంచుకునేందకు కావాల్సిన హక్కులను అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంలోని పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒడంబడిక (ఐసీసీపీఆర్) పరిరక్షిస్తుంది. ఈ ఒడంబడిక ప్రకారం భద్రతకు సంబంధించిన పరిమితులు చట్ట ఆధారితంగా ఉండాలి. జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ప్రజలను సంప్రదించలేదు. అధికారిక సమాచారాన్ని వారి వరకూ చేర్చలేనప్పుడు పుట్టే వదంతులు కూడా ఇంటర్నెట్ ద్వారా ఎంత వేగంగా వ్యాపిస్తాయో అలాగే అందరికీ చేరుతాయి. ఈ మధ్య కశ్మీరీలు చాలా భయపడిపోయి ఉన్నారు. అంతకంతకూ ఘోరమవుతున్న పరిస్థితులు చూసి ఆందోళనకు గురవుతున్నారు. అలా ఎందుకంటే, వారితో స్పష్టమైన, పారదర్శక సంప్రదింపులు జరగడం లేదు. కచ్చితమైన వివరాలను వారికి అందించడం లేదు. ఈ సమాచార అంధకారం వారి భావనలనురెచ్చగొడుతోంది. ప్రశాంతత ఇవ్వడం లేదు. అలాంటప్పుడు జాతీయ భద్రతా



లక్ష్యం చాలా కష్టంగా పూర్తవుతోంది. ఇప్పుడు ఆర్టికల్ 370ని తొలగించి మూడు వారాలు దాటింది.







సమస్యపై ఆగస్టు 22న ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటన చేసింది. "సరైన కారణాలు లేకుండా భారత ప్రభుత్వం ఇంటర్నెట్, ఫోన్ సేవలను నిలిపివేయడం ప్రాథమిక నిబంధనలకు విరుద్ధంగా ఉంది" అని పేర్కొంది. 'కశ్మీర్‌లో ప్రజాస్వామిక హక్కులను కాలరాశారు...

## దేశంలో భయోత్పాత వాతావరణం
## ది హిందూ గ్రూప్ చైర్మన్ ఎన్. రామ్

ప్రముఖ హేతువాద కార్యకర్త నరేంద్ర దభోల్కర్ స్మారక ఉపన్యాసం చేసేందుకు 'ది హిందూ' దినపత్రిక ప్రచురమ సంస్థ కస్తూరి అండ్ సన్స్ చైర్మన్ ఎన్. రామ్ మంగళవారం మహారాష్ట్రలోని పూణెకు వచ్చారు. 'భారత్ ముందు ప్రస్తుతమున్న మూడు పెద్ద సవాళ్లు: హేతువాదులపై దాడులు, భావ ప్రకటన స్వేచ్ఛకు పొంచి ఉన్న ముప్పు, అట్టడుగు వర్గాల సమస్యలు' అనే అంశంపై ఆయన ఉపన్యాసం ఇచ్చారు.

మీడియా రిపోర్టింగ్‌పై ఆయన స్పందిస్తూ 'చాలా మంది విలేఖరులు వివేకంతోనే పనిచేస్తారు. ఎమర్జెన్సీ ప్రకటించకుడానే వార్తల ప్రసారాలకు ప్రభుత్వం అవరోధం సృష్టించింది. ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. రాజకీయ నాయకులను నిర్బంధించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) కల్పించిన హక్కులను ఉల్లంఘించింది. ప్రజా స్వామ్యం ప్రమాదంలో ఉంది. కశ్మీర్‌లో అయితే అది లేనే లేదు. రాత్రికి రాత్రే ఓ రాష్ట్రాన్ని విభజించేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేశారు. సమయం వచ్చినప్పుడు మళ్లీ రాష్ట్ర హోదా ఇస్తామంటున్నారు. ఈ ప్రక్రియలో రాజ్యాంగబద్ధమైన, ప్రజాస్వామ్యికమైన హక్కులను కాలరాశారు. దీనికి వ్యతిరేకంగా నిరసనలు జరగాయనడంలో, ప్రజాస్వామ్య యుతంగా వాటిని అనుతించారనడంలో ఎలాంటి సందేహ మూ లేదు. కానీ, దేశంలో భయోత్పాత, అతివాద జాతీయవాద వాతావరణం నెలకొని ఉంది. అని అన్నారు.

– బీబీసీ సౌజన్యంతో

### నవ్వు పుట్టించే ప్రకటనలు

మూడు వారాలుగా ఎప్పుడు శ్రీనగర్ వెళ్లినా, విమానం ల్యాండ్ అవుతున్నప్పుడు సిబ్బంది ప్రతిసారీ ఏమాత్రం ఆలోచించకుండా "ఇక మీరు మీ మొబైల్ ఫోన్ ఉపయోగించవచ్చు" అనే రోబోటిక్ లైన్స్ పదే పదే వినిపిస్తూనే ఉన్నారు. స్పీకర్లోంచి ఆ మాటలు రాగానే విమానంలో ఉన్న యాత్రికులందరూ నవ్వుకుంటున్నారు. వాళ్లలో ఎక్కువగా జర్నలిస్టులే ఉంటున్నారు. లేదంటే చాలా రోజులుగా కుటుంబాలతో మాట్లాడలేకపోవడంతో ఇంటికి చేరుకుంటున్న కశ్మీరీలు ఉంటారు. జమ్ము-కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేశారనే ఆదేశాల తర్వాత అంటే మూడు వారాలకు పైగా మొబైల్, ఇంటర్‌నెట్, బ్రాడ్‌బాండ్ సేవలు ఆగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు కాస్త ఉపశమనం ఇచ్చాయి. కానీ కశ్మీర్ లోయలో కమ్యూనికేషన్ వ్యవస్థపై ఉన్న ఆంక్షలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అలాంటప్పుడు ఫ్లైట్‌లో ఆ అనౌన్స్‌మెంట్(ఇక మీరు మీ మొబైల్ ఫోన్స్ ఉపయోగించవచ్చు) నవ్వు తెప్పిస్తుంది. కశ్మీర్‌లో కమ్యూనికేషన్ల వ్యవస్థపై ఆంక్షల ప్రభావం వల్ల పిల్లలు అమ్మనాన్నలతో, భర్త భార్యతో, అనారోగ్యంతో ఉన్నవారు తమ డాక్టర్లను వెంటనే సంప్రదించలేకపోతున్నారు.


## రాజధాని క్లాసిఫైడ్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

రాయపూడి
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు, పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

సాగర్ బోర్ వెల్స్
సరసమైన ధరలకు మీరు మెచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీర్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683,

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హోమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కీనిక్, డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్:0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

విజయవాడ
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ హుస్సేన్ కట్ట వద్ద, పాత మంగళగిరి,
9848111905

ప్రకటనలకు సంప్రదించండి
9440662699










దివంగత మాజీ ముఖ్యమంత్రి డా॥వైయస్. రాజశేఖర్ రెడ్డి దశమ వర్ధంతి సందర్భంగా అమెరికాలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు జరిగాయి





Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com